


"సీరియస్‌గా చెప్తున్నా బాస్! ఇందులో వున్నది వున్నట్టు – రైటర్రాసింది రాసినట్టు మనం వేస్తే డ్రామా ఎవడూ చూడ్డు! గాడిదగుడ్డు... ఎవుడో ఎయిటీస్‌కి బిఫోర్రాసిన నాటిక ఇది! ఎంత స్టేల్ అయిపోయిందో ఆమాత్రం గ్రహించలేమా?" హీరో పాత్రధారి వైపు నుంచి ఇటు తిరిగి "ఆసిరిగా! అగ్గిపెట్టె ఇటట్రా!" సిగరెట్ నోట్లో పెట్టుకుంటూ అన్నాడు డ్రామా డైరెక్టర్ బాజీరావు. (వీరి పూర్వీకులు పీష్వా వంశస్తులనీ, చరిత్రలో వీరి వంశానికి బోల్డంత పేరు ప్రతిష్టలున్నాయనీ చెప్తుకుంటూ తిరిగే బాజీరావుకీ – సదరు పీష్వాలకీ సంబంధం నాస్తి అని; అయితే మహారాష్ట్ర నుంచి వలసొచ్చి ఆంధ్రదేశాన స్థిరపడ్డ మాట నిజమనీ ఒప్పుకోవచ్చు! మిగిలిన దగుల్బాజీ మాటల సంగతెలా వున్నా, అతడి మాటల్లో నమ్మదగ్గది – నాటకరంగ చరిత్రలో మరాఠీ నాటకాలకున్న ప్రఖ్యాతీ – ప్రత్యేకతా మాత్రం ఒక్కటే వాస్తవమని అతడ్ని బాగా ఎరిగున్నవాళ్ల ఉవాచ!)

సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ని కాకాపట్టి సెవెన్త్ 'బి' సెక్షన్‌ని రిహార్సల్స్ కోసం పట్టేసి, గత నెల న్నరగా రోజూ సాయంత్రం ఏడు నుంచి పది గంటల్దాకా అరడజను మంది వున్న ట్రూపుని రుద్దీ – తోమీ రిహార్సల్స్ చేయించేస్తున్నాడు బాజీరావు.

'రిన్నొవేటివ్ రిక్రియేషన్స్ నట సమాఖ్య'కి ఫౌండరూ; డైరెక్టరూ; పెద్ద తలకాయీ; అన్నలాళ్లకి భారీ బకాయీ అనదగ్గ బాజీరావు ఆమధ్య అనారోగ్యం పాలబడి నాల్గు నెల్లు నోర్మూసుకున్నాడు. జనరల్‌గా ఆంధ్రదేశమ్మీద ఎక్కడే పరిషత్తు పోటీలు జరిగినా తన ఆరున్నొక్క బృందంతో దండయాత్రకు బయల్దేరడం తథ్యం! ఇటు నర్సాపురం నుంచి బెజవాడ, చిలకలూరిపేటతో సహా అటు నెల్లూరు నెల్లా – ఆపైన మద్రాసు కళాసాగర్ దాకా దేన్నీ వదలకుండా ఏడాదికో ఏడెనిమిదినెల్లు పరిషత్తులకి నాటకాలాడ్డానికే అంకితమైపోయిన కళాజీవి బాజీరావు.

కాస్తో కూస్తో డబ్బులిస్తున్న ప్రభుత్వోద్యోగాన్నీ – ప్రస్తుతం దీనావస్థలో వున్న గృహస్థాశ్రమాన్నీ తృణప్రాయంగా ఎంచి, ఈ కళాసేవలోనే – సదా కాలం వెళ్లబుచ్చుతూండే బాజీరావు అడ్రను ఏ రిహార్సల్ రూంలోనో, ఏ గ్రీన్ రూంలోనో, ఏ స్టేజి మీదనో దొరకాల్సిందే తప్ప ఇంట్లో దొరకడం అనేది బహు అరుదు. అలా దొరికిన దాఖలా ఇంతవరకూ ఎక్కడా ఎవరికీ ఏదీ లేదు.

మొదటి సంతానం టైఫాయిడ్‌తో మంచమెక్కిన నెలన్నర రోజులూ కూడా ఏ చీకూ చింతా లేకుండా 'ఎదురీత' డ్రామా ఆడించడం కోసం అహర్నిశలూ శ్రమించడం అతడి స్థితప్రజ్ఞతకి నిదర్శనం.

ఆఖర్న పుట్టిన ముద్దుల కూతురుకి (ఇలా అంటాడు గాని... అతడు ముద్దుచెయ్యడం అనేది సరదాకైనా ఎవరూ చూడలేదు) మడమ ఫ్రాక్చరై ఆర్థోపెడిక్‌లో జాయిన్ చెయ్యాల్సొస్తే, డెబ్భయ్యేళ్ల వృద్ధుడైన మామగారు నడుం కట్టుకున్నాడే తప్ప కనీసం ఓసారైనా హాస్పిటల్ విజిట్ చేసి పుణ్యం కట్టుకున్న పాపాన పోలేదు బాజీరావు.

జననాలూ – మరణాలూ – వివాహాలూ – వ్రతాలూ – శుభాశుభ కార్యక్రమాలేవీ సాంసారిక సంబంధమైనవైతే అతడికి పట్టవు.

పుట్టి బుద్దెరిగిన నాటి నుంచి నిరాఘాటంగా అకుంఠిత దీక్షతో ఈ రీతిన కళామతల్లి సేవ చేస్తూన్న బాజీరావుని అతి సహజంగా సినిమా ఫీల్డు తన కౌగిట్లోకి లాక్కోవాలి! లాక్కోవడం కాదు గదా! కనీసం చేరబిలిచిన ఇన్సిడెంటు ఒక్కటీ లేదు.

ఇలాక్కాదని అతడే సినీ ఫీల్డుని దరిచేరి వలచి వెళ్లబోయేడు... వలవేసి పట్టుకోబోయేడు. కేవలం వెలివేసినట్టు అతడిని ఒక్కడినే దూరంగా వుంచేసింది చిత్రసీమ – అదేం చిత్రమోగాని (చిత్రమేం లేదు – అతడి 'ఇగో'యే కారణం అంటారు చాటుగా) అయినా వెరవలేదు. వెనుదిరగలేదు. అప్రతిహతంగా తన ప్రయత్నాల్ని కొనసాగిస్తూనే వున్నాడు బాజీరావు.

ఫిల్మిండస్ట్రీలో ఓ ఫేమస్ ప్రొడ్యూసర్ అర్థాంతరంగా 'హరీ' మంటే, అతడి స్మారకార్థం ఓ చెంచా కళాసమితి వాళ్లు నాటిక పోటీలు నిర్వహించే బాధ్యత తమ నెత్తికెత్తుకున్నారు. సదరు ప్రొడ్యూసరుకీ – నాటక కళకీ సంబంధం కాదుగదా! కనీసం అతడికి డ్రామాల పట్ల అభిరుచీ – ఆసక్తీ నయితం లేవు. పోనీ! పోటీలు ఏర్పాటు చేసిన అసోసియేషన్‌కి నాటకాలమీద ప్రేమ కారిపోతోందా అంటే – అదీ లేదు.

పోయిన ప్రొడ్యూసర్ పేరును ఏడాదికో ఏడుసార్లు స్మరించడానికీ – దినపత్రికలలో మారుమోగించడానికీ కాంట్రాక్టు తీసుకున్న కాకా సంఘం కనుక, ఏం చెయ్యాలో తోచక ఎవరి సలహామీదనో ఈ మార్గం ఎన్నుకున్నారు వాళ్లు.

బోల్డంత డబ్బు ఆర్జించీ – తన ఏకైక పుత్రరత్నాన్ని కరుణించీ ఆ ప్రొడ్యూ'సార్' మరణించడంతో, తండ్రి రుణాన్ని తనయుడు తీర్చుకుంటూన్న వైనం ఇదీ!...

కాకా కళాసంఘం ద్వారా జరిపించే ఈ ద్వైమాసిక తద్దినాలకి ఎగబడి క్రమం తప్పకుండా స్టేజి ఎక్కే ట్రూపుల్లో బాజీరావు రిన్నొవేటివ్ రిక్రియేషన్స్ మొదటి వరసలోనే వుంటుందెప్పుడూ అనడం అతిశయోక్తి మాత్రం కాదు.

వేసిన నాటికే పదే పదే వేస్తే, రిపీటెడ్ ఆడియన్స్ బోరైపోతారని గ్రహించిన బాజీరావు, చేతిలో కనీసం ఓ పాతిక స్క్రిప్టులు రెడీగా పెట్టుకుంటాడు. వాట్లో ఏ పది నాటికలు పట్టుకున్నా అవి రాసిన రైటర్లు మాత్రం ఒక్కరో లేక ఇద్దరో అయి వుంటారు. కారణం – బాజీరావుకి బాగా నచ్చిన రైటర్లు ఇద్దరే ఇద్దరు.

ఒకడు – 'రంగు మార్తాండ' కథాకేళి శాస్త్రి; మరొకడు – 'రంగస్థల జెండా' భజరంగభళి మూర్తి...

నట, దర్శక రచయితలు కూడా అయిన ఈ ద్వయంలో ఒకడు కథాకళిశాస్త్రికి ప్రమోషనొచ్చి సినిమాల్లో స్థిరపడిపోతూన్న రోజుల్లోనే, వన్ ఫైన్ మార్నింగ్ బాజీరావు ఉడతాభక్తిగా అరవీశెడు అణా నాణేల్తో వార్ని అభిషేకించి – అదే 'కనకాభిషేకం' అనుకోమని (ఆ తరువాత ఏణ్ణర్థానికే అణాలకి కాలం చెల్లిపోయిందనుకోండి! అది వేరే సంగతి!) "సార్! మీరెలాగూ ఈ సినీ రంగంలో స్థిరపడిపోతున్నారు. దయచేసి ఆంధ్రదేశమ్మీద... 'ఎక్కినచోట ఎక్కకుండా'... అనను గానీ... ఎక్కిన స్టేజీనే ఎన్నిసార్లయినా ఎక్కి – మీ నాటికలకి వేలాది ప్రదర్శనలిచ్చి అజరామరంగా అనన్య ప్రచారం కల్పించాలని సంకల్పించాను. ఈ చిరువరాన్ని నాకు ప్రసాదించండి!" అని వేడుకున్నాడు. అప్పటికే నాటికి రావలసిన పేరు అంచనాలకి మించి వచ్చేసినందువల్ల "పోన్లే! మనకేం పోయింది?" అని కథాకళి శాస్త్రి ఆ అనుంగు వరాన్ని బహు ఉదారంగా బాజీరావుకే అనుగ్రహించాడు.

తదాది వారి నాటికల హక్కులు పొందిన ఏకైక సంస్థగా రిన్నొవేటివ్ రిక్రియేషన్స్ పేపరు ప్రకటన ద్వారా చాటింపు వేసుకుని – ఇతర నాటక సంస్థల కళ్లు, వారి నాటికల మీద పడకుండా పరిరక్షించుకుని ప్రదర్శనోద్యమ దిశగా సాగిపోయేరు బాజీ అండ్ కో. అంతే కాదు! భవిష్యత్‌లో కథాకళి శాస్త్రి ఏ కొత్త నాటిక రాసినా (అతడెలాగూ రాయడు. సినిమా డైలాగులకే టైం చాలదతడికి!) దాని తొలి ప్రదర్శన భాగ్యం, తన సంస్థకే కలిగించమని మాట తీసుకుని మరీ కదిలాడతడు.



– భాగవతుల సుబ్రహ్మణ్యం

అంత ఫ్లాష్ బ్యాక్ వున్న కళాసంస్థ అతడిది!

అడపాదడపా, ఎక్కడేనా స్టేజి ప్రదర్శన సమయంలో వారి హాజరు లభ్యమైతే బాజీరావు, కథాకళి శాస్త్రిని ఆహ్వానించడం జరుగుతూండేది కాని, ఆ మధ్య ఆయన చిత్రరచనే కాకుండా – దర్శకత్వంలోనూ బిజీ అయిపోయిన దగ్గర్నుంచీ, వారి నాటికల గురించి వారే పట్టించుకొనే తీరిక లేకపోయింది.

చాలా కాలం తరువాత...

భాగ్యనగరంలో – సదరు ప్రొడ్యూసరు స్మారకార్థం పెట్టిన నాటిక పోటీలకి చెంచా కళాపరిషత్ వారి అతి మొహమాటపు అభ్యర్థన కాదనలేక ముఖ్య అతిథిగా విచ్చేయడానికి కథాకళి శాస్త్రి అంగీకరించడంతో, ఆ సంగతి తెలిసి బాజీరావు రెట్టించిన ఉత్సాహంతో ఆయన విరచితమైన 'విధి బలీయం' నాటిక... ఆయన నాటికల్లో ఆయనకెంతో ఇష్టమైనదని చెప్పకొనే నాటిక ప్రదర్శించ సంకల్పించాడు.

ప్రస్తుత రిహార్సల్ సంరంభం అదే!...

గబగబా రెండు దమ్ములు సిగరెట్ పొగ గుండె నిండా పీల్చాక "రెడీ! కమాన్! స్టార్ట్ ఎగైన్" అంటూ "ఎవర్రా అక్కడ? ఓ.బి.వాయిస్‌లో 'విధి బలీయం అన్నారు. నాకోసం నువ్వు బలైపోయావా బ్రదరూ!' అనే డైలాగ్ రావాలి! చెప్పండి!" గట్టిగా అన్నాడు లెఫ్ట్‌సైడ్ వింగ్ నుద్దేశించి.

అవతల్నుంచి "రెడీ బాస్! విధి బలీయం..." డైలాగ్ విన్పించింది.

అందులో అనుకున్న ఎఫెక్టు పలకలేదు.

"ఒరే తండ్రీ! వాయిస్ కాస్త పేథటిగ్గా వుండాల్రా! మళ్లీ ఏడవండి డైలాగు" చిరాకుపడ్డాడు బాజీరావు.

ఈసారి బాజీరావు కోరినట్టు ఏడ్చినట్టే పలికించాడు ఆ పాత్రధారి.

"గుడ్! ఏడిసినట్టే వుంది!" అని సర్టిఫై చేసి "నెక్స్ట్... ఒరే హీరో! ఇప్పడు నీ రియాక్షన్ డైలాగ్" అనగానే, ఎదురుగా వున్న పాత్రధారి పేపర్ చేత్తో పట్టుకుని డైలాగ్ చెప్తూంటే "చదవకురా నటనీరసా! మరేం మర్చిపోయి ఛావవుగాని, ఆ పేపర్లు ప్రాంప్టరప్పారావు చేతికిచ్చి తగలడు!" అంటూ తల పట్టుకున్నాడు బాజీరావు.

"అది కాదు బాస్! ఈ డైలాగ్స్ అన్నీ ఇక్కడ్నించి ఒరిజినల్ స్క్రిప్టులో వున్నవి కావుగా! అంతా మీ రైటింగ్‌తో వున్నాయి. కనెక్షన్ కోసం సరిచూసుకుంటున్నాను" అని సంజాయిషీ ఇచ్చుకున్నాడు అతడు.

"ఏం కనెక్షనో ఏంటో?! డిక్షన్ చూసుకో ముందు. స్టేజీమీద నా పరువు తియ్యకండి" ఓ ఆర్డర్ పడేసి "అసలే చాదస్తం బ్రాహ్మడు శాస్త్రిగారు... సౌలభ్యం కోసం మనమెంత మార్చి రాసినా, డ్రామా బావుంటే – అంతా తన ప్రతిభేననుకుంటాడు. ఖర్మకాలి స్టేజీమీద చీదేసిందా – తన స్క్రిప్టు మంటగలిసిపోయిందని కథాకళి ఆడేస్తాడు" గొణుక్కున్నాడు బాజీరావు.

"మీరు ధైర్యంగా వుండండి బాస్! డ్రెస్ రిహార్సల్స్‌లో చూపిస్తాం‌ండి అదరగొట్టేస్తాం!" భరోసా ఇచ్చాడు కమెడియన్ పాత్రధారి.

కేవలం ఉత్త హామీ మాత్రమే కాక – ప్రదర్శన రోజున నిజంగానే నాటిక రక్తికట్టించడంలో టీమ్ స్పిరిట్ అభినందనీయంగా కృషిచేసింది. 'విధి బలీయం' నాటిక రసవత్తరంగా సాగింది. ఆడిటోరియం కరతాళ ధ్వనులతో మారుమోగిపోయింది. పెద్ద బరువు దిగిపోయినట్టుగా ఫీలయ్యాడు బాజీరావు. 'బెస్ట్ డైరెక్షన్' ఆశించవచ్చు అని కూడా అన్పించిదతడికి.

నాటిక ప్రదర్శన అవగానే ఆనవాయితీగా పాత్రధారుల్నీ – సాంకేతిక నిపుణుల్నీ పరిచయం చేస్తూ "ఈ నాటికలో సందర్భోచితమైన మార్పులను కాలానుగుణంగా చేసుకుంటూ నిత్యనూతనంగా మీ ముందుంచుతున్న దర్శకుడు – ఇతడే బాజీరావు" అనగానే వినయంగా స్టేజి మధ్యకొచ్చి సభకు అభివాదం చేశాడు బాజీరావు.

సభలో మళ్లీ భారీగా చప్పట్ల మోత...

"వహ్వా! ఏం భేషుగ్గా మార్చేవ్ గురూ!"...

"శెభాష్! అదరగొట్టే ఛేంజెస్ చేశావు... సూపర్" ఇలాంటి అప్లాజ్ వరించిందతడ్ని.

"ఇప్పడు – ఈ నాటిక రచయిత... కథాకళి శాస్త్రి... మీకందరకూ తెలుసు! ప్రఖ్యాత చలనచిత్ర రచయితా – దర్శకులూ అయిన వారిని గురించి ప్రత్యేకంగా పరిచయం చేయడం అంటే సూర్యుడికి దివిటీ పట్టినట్టే అవుతుంది! వారు మన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూడా విచ్చేశారు. ఈ నాటికను గూర్చి వారిప్పుడో రెండు ముక్కలు మాట్లాడతారు. అనంతరం సభా కార్యక్రమం వుంటుంది" అని నిర్వాహకుడు ప్రకటించడంతో కథాకళి శాస్త్రి వేదికమీదకు రాక తప్పలేదు.

నమస్కార ముద్రతో నిలుచున్న శాస్త్రికి సభలోంచి పెద్ద రెస్పాన్సేమీ రాలేదు. ఒక సినిమా డైరెక్టర్ కంటె, ఒక డ్రామా డైరెక్టర్‌కే ఇందాక పెద్ద పెట్టున సభ నీరాజనం పట్టింది. అది కథాకళి శాస్త్రి దృష్టిని దాటిపోలేదు.

తన నాటికాభిమానుల్ని ఉద్దేశించి ఓ అరగంటకి తక్కువ గాకుండా ప్రసంగిద్దామనుకున్నవాడు కాస్తా నీరుగారిపోయాడు. అయినా నిర్వాహకుడు కోరినట్టు – ఓ రెండు ముక్కలు చెప్పదల్చుకున్నాడు...

"సభకు నమస్కారం! మీరు బాగా ఎంజాయ్ చేసిన 'విధి బలీయం' నాటిక రచయితగా నా పేరు డిక్లేర్ చేశారు. అది సరికాదు. ఆ పేరుతో గతంలో నేనొక నాటిక రాసిన మాట వాస్తవమే! కాని, దానికీ – దీనికీ ఎక్కడా పొంతనా పొందికా లేదు. విధి నిజంగానే బలీయమైంది కాబోలు! అది నా నాటిక ఇతివృత్తాన్నే బలితీసుకుంది. అనవసరమైన పెరుగుదలతో కొంత భాగం. అత్యవసరమైన చోట కుదింపుతో కొంత భాగం, మరికొంత వెకిలి హాస్యం, ఊదరగొట్టు డైలాగ్స్‌తో ఇంకొంతా జర్కులకీ – షాక్‌లకీ గురై 'విధి బలీయమై' చిక్కిపోయింది. నిజం చెప్పాలంటే – ఆ నాటిక మరణించింది. ఇప్పడు మీరు చూసినదీ – అద్భుతంగా వుందని మెచ్చుకున్నదీ సరికొత్త 'విధి బలీయం'. దీని రచన – దర్శకత్వ ప్రతిభకి పూర్తి క్రెడిట్స్ బాజీరావుకే దక్కుతుందని ఈ సభాముఖంగా ప్రకటిస్తున్నాను. ఇకపై ఈ నాటిక విషయమై రచయితగా, నా పేరు ఎక్కడా పేర్కొనవద్దని అభ్యర్థిస్తున్నాను. నటీనటుల సౌలభ్యం కోసమో దర్శకుడు తన డాంబికాన్నీ – డామినేషన్‌నీ ప్రదర్శించుకోవడం కోసమో, నాటిక రచయితని అక్షరాక్షరానా నిర్దాక్షిణ్యంగా హత్యచేసి, ఒరిజినల్ ఫ్లేవర్‌ని కాలరాసేసి కాలరెగరేసే దుస్సాంప్రదాయం ప్రబలిన నేటి దుస్థితిలో... రైటర్లు కొత్త నాటికలు రాయడం లేదని; తెలుగు నాటిక రంగంలో కొత్త పోకడలు రావడం లేదని నిందలెయ్యొద్దని సవినయంగా వేడుకుంటున్నాను. ప్రయోగం పేరిట సొంత పైత్యం జతచేసి, సమూలంగా నాటిక ముఖ్యోద్దేశాన్ని బలిపెట్టగల దర్శక స్రష్టలకి మరోమారు జేజేలు పలుకుతూ, 'కవయా – నిరంకుశః'... అంటే – కవులు నిరంకుశులు అని నానుడి!... రచయితలకీ ఇది వర్తిస్తుందనుకోండి! అంచేత – 'స్రష్ట'నీ, అతడి 'సృష్టి'నీ తుంగలో తొక్కేసి... తన స్వార్థానికి బలిపెట్టే దర్శకుల పాలబడకుండా వుండేందుగ్గాను – ఇకపై ఏ కొత్త నాటిక రచనా చేయనని హామీ ఇస్తూ... కాదు! కాదు!... శపథం చేస్తున్నాను"– అనగానే, బాజీరావు ముఖంలో మెత్తటి ముఖమల్ చెప్పదెబ్బ తిన్న ఫీలింగ్స్ కలిగాయని వేరే చెప్పనక్కర్లేదనుకుంటా!